# పరిహారం

కొంతమందిని అదృష్టం అమాంతం వరిస్తుందనుకుంటా. మా బావకున్న రెండెకరాల మెట్టలో ఏం పండించినా నష్టం తప్ప లాభం రావటం నాకు గుర్తులేదు. దాన్ని ఈనాడమ్మినా రెండెకరాలకూ కలిపి యాభైవేల కన్నా ఎక్కువ రాదు. అలాంటిది ప్రభుత్వం వారు రక్షణ శాఖకు సంబంధించిన కర్మాగారం ఏదో నిర్మించాలని తలబెట్టి ఆ ప్రాంతం భూమిని ఆధీనం చేసుకున్నారు. అందులో బావ రెండకరాలూ ఉన్నాయి.

ప్రభుత్వం వారు నష్ట పరిహారంగా చదరపు గజానికి ఇస్తామన్న రేటు వీరికి నచ్చక కోర్టుకెళ్ళారు. ఆ కోర్టు వారు రేటు పెంచినా అదీ తక్కువేనని హైకోర్టుకెళ్ళారు. ప్రభుత్వం కూడా కోర్టు నిర్ణయించిన రేటు ఎక్కువని అప్పీలు చేసుకుంది. ఈ వివాదం ఇలా అయిదు సంవత్సరాలు నలిగి - చివరికెలాగయితేనేం హైకోర్టు తీర్పుతో ఓ కొలిక్కి వచ్చింది. దాని పర్యవసానమే మా బావకు పది లక్షలు రావటం -

పది లక్షలు ! అంత డబ్బుని తల్చుకోగానే నాకు కళ్ళు తిరిగినట్లనిపించింది. ఏం చేసుకుంటారో అంత డబ్బుని! వారుంటున్న పూరిల్లు వదిలేసి ఓ పెద్ద యిల్లు, కారు కొనేసి ఉంటారు.

గత నాలుగేళ్ళుగా వ్యవసాయంలో నాకు నష్టాలే వస్తున్నాయి. దానికి తోడు అప్పులు . . . . బావకు పది లక్షలు వచ్చి ఆర్నెల్లు దాటినా వెళ్ళి సహాయం అడుగుదామంటే అభిమానం అడ్డొచ్చి ఇన్నాళ్ళూ ఆగిపోయాను. కానీ ఇపుడు - నా భార్య పోరుపడలేక వూరికి బయల్దేరాను.

బస్‌లో కూచున్నానన్న మాటే గానీ బెరుగ్గానే ఉంది. తోబుట్టువు నిచ్చిన

యిల్లు . . . . నేనివ్వాలి గానీ వారి ముందు చేయి చాపకూడదు. కానీ నా అప్పులు?

ఇంతకు ముందుఅడపాదడపా అక్క ఉత్తరాలు రాసేది. పది లక్షలు వచ్చినప్పటి నుండైతే ఒక్క ఉత్తరం ముక్క కూడా రాయలేదు. "కళ్ళు నెత్తికెక్కి ఉంటాయి" అనే నా భార్యతో ఏకీభవించకున్నా. . . పది లక్షలు కదా. . .ఎవరికయినా అంత డబ్బు చూడగానే కొద్దిగానైనా అహంకారం రావటం సహజం కదా అన్పించింది. అయినా అవసరం నాది.

బస్ దిగాక అనుమానం వచ్చింది. కొత్తయిల్లు ఎక్కడ కొన్నారో? ఎవర్ని అడగాలి? పాత యింటికే పోయి అడగటం మంచిదని, అదే పూరింటికి పోయి "ఏమండీ" అంటూ పిలిచాను. మా అక్కే తలుపు తీసింది. నేను ఆశ్చర్యపోయి చూస్తుంటే, "అదేమిట్రా అలా బొమ్మలా నిలబడ్డావు! నేను దయ్యంలా కన్పిస్తున్నానా. . . . రా లోపలికి" అంది.

"మీరు కొత్త యిల్లుకొనలేదా అక్కా . . . . డబ్బంతా బ్యాంక్‌లో వేసుకున్నారా ఏమిటీ?" అన్నాను లోపలికి నడుస్తూ.

ఇంటిముందు కారున్న జాడలేవీ కన్పించలేదు. బావేమైనా షికారుకేసు కెళ్ళాడేమోనని "బావేడీ" అన్నాను.

"వేరే వాళ్ళ పొలంలో కూలికెళ్ళాడ్రా" అంది దిగులుగా. . . .

"అదేమిటి" అన్నాను అర్థంగాక.

"అవున్రా - పది లక్షలు వచ్చిన మాట వాస్తవమే. ఈ అయిదేళ్ళలో లాయర్లకయిన ఫీజులూ, ఇచ్చుకున్న మామూళ్ళు . . . . ఇవన్నీ పోను పాతికవేలు అప్పు మిగిలింది" అంది కన్నీళ్ళు చెంగుతో ఒత్తుకుంటూ.

నేను అదే రోజు సాయంత్రం తిరుగు ప్రయాణమౌతూ అక్కచేతిలో వంద రూపాయ లుంచాను - ఏమైనా కొనుక్కోమని.

● *ఆంధ్రభూమి, మే 7, 1998* ●